సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి



కౌన్సిల్‌లో మాట్లాడుతున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి

అంగన్‌వాడీ కేంద్రాల కోసం ఎదురుచూపులు

- పక్క వార్డుల్లోని కేంద్రాలకు వెళ్తున్న 20వ వార్డు గర్భిణులు, బాలింతలు, చిన్నారులు
- చిన్నారులకు సకాలంలో అందని పోషకాహారం
- ఎన్నిసార్లు వేడుకున్నా పట్టించుకోని ఉన్నతాధికారులు

కౌన్సిల్‌లో నాలుగు సార్లు ప్రస్తావించినా..

20వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ కౌన్సిల్‌లో నాలుగు సార్లు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి ప్రస్తావించారు. వార్డు పరిధిలో కేంద్రాలు లేకపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందక అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినప్పటికీ కౌన్సిల్ కానీ, జీవీఎంసీ అధికారులు కానీ ఇప్పటి వరకు వార్డులో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

టీచ్‌రోడ్డు : జీవీఎంసీ 20వ వార్డులో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందడం గగనమవుతోంది. చిన్నారులకైతే బాల విద్య అందడమే లేదు. నిరుపేద బాల బాలికలు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ పోషకాహారం అందించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల వ్యవస్థను ప్రవేశపెట్టాయి. అయితే 20వ వార్డు ఏర్పాటై 5 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నేటికీ ఒక్క కేంద్రమూ ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. ఫలితంగా ప్రభుత్వం అందించే పౌష్టికాహారం కోసం ఈ వార్డులోని పిల్లలు, గర్భిణులు, బాలింతలు పక్క వార్డుల్లోని కేంద్రాలపై ఆధారపడుతున్నారు. జీవీఎంసీ 20వ వార్డు 2021లో ఏర్పాటైంది. ఈ వార్డులో సుమారు 25 వేల మంది జనాభా నివసిస్తున్నారు. పెదవాల్తేరు, ఈస్ట్ పాయింట్ కాలనీ, చిన వాల్తేరు, డాక్టర్స్ కాలనీ, శివాజీపాలెం వంటి ప్రముఖ ప్రాంతాలతో కలిపి వార్డు ఏర్పాటు చేశారు. ఇంత మంది జనాభా ఉన్నప్పటికీ వార్డులో ఒక్క అంగన్‌వాడీ కేంద్రమూ లేకపోవడంతో ఇక్కడి వారికి పౌష్టికాహారం అందడం లేదు. వారంతా సమీపంలోని జీవీఎంసీ 17, 21వ వార్డుల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది.

పట్టించుకోని ఉన్నతాధికారులు

జీవీఎంసీ 20వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్‌కు అనేక సార్లు వార్డు ప్రజలు విన్నవించుకున్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల సురేష్ కూడా జీవీఎంసీ కమిషనర్‌కు, కలెక్టర్‌కు, మంత్రులకు వినతిపత్రాలు సమర్పించారు. జిల్లా అభివృద్ధి కమిటీ మీటింగ్‌లో సైతం ఈ సమస్యను లేవనెత్తినప్పటికీ అధికారుల నుంచి కనీస స్పందన రాలేదు.

అందుబాటులో కేంద్రాలు ఉండుంటే...

జీవీఎంసీ 20వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రాలు అందుబాటులో ఉండి ఉంటే 0 – 6 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు సకాలంలో పౌష్టికాహారం అందించవచ్చు. ఆరోగ్య తనిఖీలు, టీకాలు వేయించడం, ఇతర ఆరోగ్య సంరక్షణ సేవలు పొందవచ్చు. అలాగే 3 నుంచి 6 సంవత్సరాల మధ్య వయస్సు గల పిల్లలు ప్రీ – స్కూల్ విద్య పొందవచ్చు. పిల్లల సంపూర్ణ శారీరక, మానసిక, సామాజిక అభివృద్ధిని ప్రోత్సహించవచ్చు. 20వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రాలు లేకపోవడంతో పేద ప్రజలు, వారి పిల్లలు వీటికి దూరమవుతున్నారు. ఎప్పుడు కేంద్రాలు ఏర్పాటు చేస్తారా అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

అంగన్‌వాడీకి వెళ్లలేకపోతున్నా..



మా ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రం లేదు. బాలింతను కావడంతో పక్క వార్డులోని కేంద్రాలకు వెళ్లలేకపోతున్నా. గర్భిణిగా ఉన్నప్పుడు కూడా ప్రభుత్వం అందించే పౌష్టికాహారం పూర్తిగా పొందలేకపోయా. అదే మా 20వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రం ఉంటే పూర్తి స్థాయిలో పౌష్టికాహారం పొందే అవకాశం ఉండేది. అధికారులు ఇప్పటికైనా మా ప్రాంతంలో కేంద్రం ఏర్పాటు చేయాలి.

– ధమ్మల హారిక, బాలింత, పెదవాల్తేరు

ప్రజల ఆరోగ్యం కోసమైనా...



జీవీఎంసీ 20వ వార్డులో ఒక్క అంగన్‌వాడీ కేంద్రమూ లేకపోవడంతో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు సరైన పౌష్టికాహారం సకాలంలో అందడం లేదు. దీంతో వారు అనారోగ్యానికి గురవుతున్నారు. ఇదే విషయమై నేను కౌన్సిల్‌లో 4 సార్లు ప్రస్తావించినా ఫలితం లేకుండా పోయింది. ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి మా వార్డులో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

– మువ్వల లక్ష్మి, 20వ వార్డు కార్పొరేటర్



జీవీఎంసీ 20వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న మువ్వల సురేష్, తదితరులు

క్లుప్తంగా

ఉచితంగా మందుల పంపిణీ



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి రామకృష్ణాపురంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గ్రామాభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో జేడీఎస్ ఆస్పత్రి వైద్య బృందం ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానికులకు మధుమేహం, బీపీ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు స్థానికులకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామాభ్యుదయ సేవా సంఘం సభ్యులు వంకర బాబూరావు, కాకర గోవింద్, సింహాచలం, నాగేశ్వరరావు, శ్రీరాం, కృష్ణ, ముత్యాల దేవుడు, ఆస్పత్రి సిబ్బంది సంతోష్, అనిల్, రేవతి, సాయి పాల్గొన్నారు.

పిల్లలకు పుస్తకాల పంపిణీ

ఆరిలోవ : జీవీఎంసీ పదకొండో వార్డులో ముస్తఫా ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు ఆదివారం పంపిణీ చేశారు. సుమారు 250 మంది విద్యార్థులకు పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో మస్తాన్ జ్యూయలర్స్ అధినేత మహ్మద్ నజీర్, అసోసియేషన్ పెద్దలు కాలేషా, అలీ, మొహిద్దీన్, ఫిరోజ్‌బాబు, షామర్, జాని, స్థానిక నాయకులు రాజారావు, అచ్చుతరావు, అప్పారావు, పేపర్ నాయుడు, రేఖా జ్యోతి పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న న్యాయవాది శ్రీలక్ష్మి

ఎంవీపీ కాలనీ : రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీ సేవలపై జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ రైతు బజార్‌లో ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సలహా సర్వీస్ అథారిటీ న్యాయవాది శ్రీలక్ష్మి, పారా లీగల్ వలంటీర్ భవానీ రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న న్యాయపరమైన సహకారం, పథకాలు, రిజర్వేషన్‌తో లభిస్తున్న సబ్సిడీ వివరాలు తెలియజేశారు. అర్హులైన వారు ఆయా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు బజార్ ఈవో వరహాలు, సహాయకుడు కనకరాజుతోపాటు మహిళ రైతులు పాల్గొన్నారు.

రసాయనాల వాడకంలో అప్రమత్తత అవసరం

టీచ్‌రోడ్డు : ఇళ్లలో ఉండే దోమలు, పురుగుల నివారణకు సురక్షితమైన రసాయనాలు మాత్రమే వినియోగించాలని హోం ఇన్సెక్ట్ కంట్రోల్ అసోసియేషన్ (హీకా) కార్యదర్శి డి.జయంత్ సూచించారు. డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల నుంచి రక్షించుకోవడానికి వినియోగించే రసాయనాలపై అవగాహన సదస్సు నగరంలోని ఒక హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆమోదించి ప్యాకింగ్‌పై సీఐఆర్ రిజిస్ట్రేషన్ నెంబరు ముద్రించిన రసాయనాలను మాత్రమే వినియోగించాలని సూచించారు. ఇటీవల విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి సేకరించిన అగరబత్తీలు ప్రభుత్వ ఆమోదం లేని మెపాఫ్లుథిన్ అనే రసాయనం కలిగి ఉన్నాయని, వాటిని పీల్చడం ద్వారా మనుషులు అనారోగ్యానికి గురవుతారన్నారు.

17న మెగా రక్తదాన శిబిరం

డాబాగార్డెన్స్: ఈ నెల 17న విశాఖలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు తెరపాంత్ యువక్ పరిషత్ విశాఖ శాఖ సభ్యులు తెలిపారు. డాబాగార్డెన్స్ ఆదాయపు పన్ను శాఖ కార్యాలయ రోడ్డులోని పరిషత్ కార్యాలయంలో ఆదివారం కమిటీ సభ్యులు వివరాలు వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఈ మహా రక్తదానం జరుగుతుందన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కూడా సొంతం చేసుకున్నట్టు చెప్పారు. విశాఖలో ఆపదలో ఉన్న ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ఈ శిబిరం ద్వారా రక్తం సేకరించి అందిస్తామని తెలిపారు. ఈ మహా రక్తదానంలో సుమారు 2500 యూనిట్ల రక్త సేకరణే లక్ష్యమని పేర్కొన్నారు. విశాఖలో 60 కేంద్రాల్లో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని కోరారు.

నివాసాల మధ్య చర్చి ఏర్పాటు చేయొద్దని ధర్నా



చర్చి ఏర్పాటు చేయనున్న ఇంటి ముందు జెండాలతో ధర్నా చేస్తున్న స్థానికులు

ఆరిలోవ : జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి శ్రీకృష్ణాపురంలో ఓ ఇంట్లో చర్చి ఏర్పాటు చేయడానికి కొందరు సన్నాహాలు చేస్తున్నారు. దాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. నివాసాల మధ్య చర్చి ఏర్పాటు చేయొద్దని గ్రామస్తులు ఆ ఇంటి ముందు భజరంగ దళ్ జెండాలు పట్టుకుని ధర్నా చేపట్టారు. ఇక్కడ చర్చి నిర్వహించొద్దని నినాదాలు చేశారు. గతంలో ఈ చర్చిని ఇదే వార్డు దారపాలెంలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించగా అక్కడ గ్రామస్తులు అడ్డుకున్నారని స్థానికులు తెలిపారు. దీంతో దారపాలెంలో ఆగిపోయిన ఆ చర్చిని శ్రీకృష్ణాపురంలో ఏర్పాటు చేయడానికి ఇప్పుడు సన్నాహాలు చేస్తున్నారన్నారు. దీన్ని ఇక్కడ నివాసాల మధ్య ఎట్టి పరిస్థితుల్లోనూ ఏర్పాటు చేయనీయమంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ధర్నాలో గ్రామస్తులు రాము, శ్రీనివాస్, కిరణ్, వెంకటరెడ్డి, ప్రసాద్, దేవిక, మల్లిక, మణికంఠ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవలో ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆరిలోవ : ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో గుట్టుగా కొందరు వ్యక్తులు పేకాడుతున్న ఇంటిపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. వారిని అదుపులోకి తీసుకుని నగదు స్వాధీనం చేసుకున్నారు. ఆరిలోవ సీఐ హెచ్.మల్లేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ పదమూడో వార్డు పరిధి ఆరిలోవ కాలనీ ప్రాంతం ప్రగతినగర్‌లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ ఇంటిపై దాడి చేశారు. అక్కడ పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని... రూ.1,52,100 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని ఆరిలోవ పోలీసులకు అప్పగించారు. దీనిపై సీఐ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు.

బీచ్‌లో చెత్త తొలగింపు



తెన్నేటి పార్కు వద్ద బీచ్‌లో శుభ్రం చేసిన పారిశుధ్య కార్మికులు, త్రిబుల్ ఒన్ యువత

ఆరిలోవ : జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి తెన్నేటి పార్కు, జోడుగుళ్లపాలెం ప్రాంతాల్లో శానిటరీ సిబ్బంది బీచ్‌ను శుభ్రం చేశారు. త్రిబుల్ ఒన్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ యువత ఉత్సాహంగా పాల్గొని బీచ్‌లోని చెత్త సేకరించి శుభ్రం చేశారు. ఖాళీ కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ సంచులు, పేపర్ ప్లేట్లు, తదితర చెత్తను సేకరించిన సంచుల్లో వేసి జీవీఎంసీ పారిశుధ్య వాహనాలకు అందించి డంపింగ్‌యార్డుకు తరలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీ, సిబ్బంది, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్సీ కులాల ఆత్మీయ సమావేశం



ఉపాధ్యాయుడు కృష్ణారావును సత్కరిస్తున్న సమరసత సభ్యులు

ఆరిలోవ : సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో తోటగరువు ఎర్నిదుర్గామాంబ కల్యాణ మండపంలో ఎస్సీ కులాల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో కొన్ని తరాలుగా వివక్షకు గురైన ఎస్సీ కులాల ప్రతినిధులను ఆహ్వానించారు. ముఖ్య అతిథులుగా హైదరాబాద్‌కు చెందిన అఖిల భారత సంయోజక్, సామాజిక సమరసత ప్రతినిధి శ్యాంప్రసాద్, కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ బొంతు కోటయ్య పాల్గొన్నారు. ఎస్సీ కులాలుగా పిలవబడే సుమారు 59 వర్గాల వారు కొన్ని తరాలుగా వివక్షకు గురయ్యారన్నారు. వారంతా ఏవిధంగా వివక్షకు గురయ్యారో వివరించారు. అలాంటి వారిలో కొందరు క్రిస్టియన్లుగా మారాల్సి వచ్చిందన్నారు. అలాంటి వారిని గుర్తించి హిందు సమూహంలోకి ఆహ్వానించాల్సిన అవసరముందన్నారు. ఈ సందర్భంగా వివక్షకు గురైన పలువురిని నిర్వాహకులు సత్కరించారు.

విద్యార్థుల అభ్యున్నతిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్, తదితరులు

సీతంపేట: విద్యార్థుల అభ్యున్నతిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని నాగార్జున యూనివర్సిటీ రిటైర్డ్ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్ అన్నారు. బాలవికాస్ ఫౌండేషన్, గాంధీ సెంటర్ ఆధ్వర్యంలో బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఆదివారం జాతీయ, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి ద్వారానే విద్యార్థి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోగలరన్నారు. విద్యార్థుల మేధస్సుకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయుల బోధన సాగాలన్నారు. కృష్ణ యూనివర్సిటీ రిటైర్డ్ వీసీ ఆచార్య రామకృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక విద్య నుంచే క్రమశిక్షణ, అంకితభావం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంతోపాటు సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన తిరుమల శ్రీదేవి, రాష్ట్ర స్థాయిలో అవార్డులు పొందిన జి.కుమార స్వామి, జి.ఎం.సుజాత, ఎం.మోహనరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీజీపీ అత్తిలి సుధాకర్, బాలవికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాశరావు, రచయిత ఆర్.శివకుమార్, బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బి.కె.కామేశ్వరి, టీవీఎఫ్ కన్వీనర్ జ్ఞానేశ్వర్ బాబ్జి, అధ్యాపకులు, ఎన్జీవోలు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమంతోనే హక్కుల సాధన

సీతంపేట: దళిత బహుజనులు ఏకం కావాలని, హక్కుల కోసం ఐక్య ఉద్యమమే మార్గమని ద్రావిడ యూనివర్సిటీ రిటైర్డ్ వీసీ ప్రొఫెసర్ కె.ఎస్.చలం అన్నారు. భీమ్‌సేన వార్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో బహుజనులారా మీరు ఎటువైపు అనే అంశంపై ఆయన ప్రసంగించారు. బహుజనులంతా అనేక పార్టీల కింద విభజించి ఉన్నారని, వారంతా ఏకమై హక్కుల సాధన, రాజ్యాధికారం దిశగా పయనించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. సిక్కోలు బుక్ ట్రస్టు సంపాదకుడు దుప్పల రవికుమార్ అస్తిత్వ స్పృహ అనే అంశంపై మాట్లాడుతూ భారతదేశం 6300 కులాలుగా, ఎస్సీ, ఎస్టీ, బీసీలను చీల్చి వేసి వారి మధ్య ఐక్యత లేకుండా విష సంస్కృతిని సృష్టించారన్నారు. అనంతరం సదస్సులో పలు తీర్మానాలు ఆమోదించారు. సంస్థ ప్రతినిధులు వసంత రాజేంద్రప్రసాద్, కె.చిన్నారావు, కనకరాజు పాల్గొన్నారు.























